కేసీఆర్ నీళ్లియ్యనిదే తెలంగాణ పచ్చబడ్డదా?

- కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కావాలని కరాబ్ చేసిండా?
- మనం ఇండ్లు కట్టుకుంటే గోడలకు పగుళ్లు రావా?

- గీయింతదానికే కాంగ్రెసోళ్లు గాయిగాయి చేస్తున్నరు
- వీళ్లను గెలిపించిన నెలకే మన జుట్టు కేంద్రం చేతిల పెట్టిన్రు
- కేసీఆర్ సభకు వస్తే కాంగ్రెసోళ్ల దుమ్ము దులుపుతడు
- పాలమూరు యువరైతు, సెలూన్ ఓనర్ శివ ప్రతిస్పందన

పచ్చబడిన పాలమూరు: నీళ్లు పుష్కలంగా ఉండడంతో యాసంగిలోనూ వరి సాగు

ఇల్లెందుల దుర్గాప్రసాద్
(నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి)

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): 'కేసీఆర్ నీళ్లియ్యనిదే తెలంగాణ పచ్చబడ్డదా?.. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ కావాలని కరాబ్ కట్టిండా? మనం ఇండ్లు కట్టుకుంటే గోడలకు పగుళ్లు రావా?.. గీయింతదానికే కాంగ్రెసోళ్లు గాయిగాయి చేస్తున్నరు.' అంటూ పాలమూరు యువరైతు, సెలూన్ ఓనర్ శివ కాంగ్రెస్ సర్కారు తీరుపై మండిపడ్డాడు. ఈ రెండు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వ తీరు, సాగునీటి ప్రాజెక్టులను నిరర్థకమంటూ చేస్తున్న ప్రచారాన్ని ఎండగట్టాడు. నాగెళ్లి శివ (30) ఊరు జడ్చర్ల సెగ్మెంట్ మిడ్జిల్ మండలం కొత్తూరు. నాన్న కృష్ణయ్య, అమ్మ ప్రభావతి లది రెండెకరాల వ్యవసాయ భూమి గల బీద నాయీ బ్రాహ్మణ కుటుంబం. తలాపున అన్నట్టుగా కృష్ణమ్మ (కృష్ణానది) కనుచూపు మేరలో కనిపించినా చేలకు మలిపే నాథుడు లేడు. హామీలే కానీ, అమలు చేయని అసమర్థ ప్రభుత్వాలు. వాటికవే తుమ్మ చెట్లు, పొదలు అల్లుకుపోయి ఆశల్ని చిదిమేసిన కాలం. పంటలు పండించుకోలేని దైన్యం. పిల్లలు, కుటుంబ పోషణకు కృష్ణయ్య బ్యాండ్ బృందంగా ప్రత్యామ్నాయం చూసుకోగా, ప్రభావతి కూలి పనుల్లో చెమటోడ్చేది. శివకుమార్ తన తమ్ముడు గణేశ్‌తో కలిసి పట్నం (హైదరాబాద్) బాట పట్టారు. సిటీలో సెలూన్ పనిలో కుదిరారు. ఎదుగూ బొదుగూ లేకుండా కుటుంబాన్ని భారంగా నెట్టుకొచ్చారు.

కేసీఆర్ పాలనలో మారిన బతుకు

స్వరాష్ట్రంలో పాత పాలమూరు జిల్లాలో కరువును తరిమేసేందుకునీఎం కేసీఆర్ కంకణబద్ధులైన ఫలితం క్షేత్రంలో ఉనికిలోకి రావడం శుభపరిణామమైంది. కల్వకుర్తి ఎత్తిపోతల, ఇతరత్రా ఏర్పాట్లు నోరు తెరిచిన స్థానిక నీటి వనరులకు కొత్త కళ తేసాగాయి. కృష్ణా నదిలో అంతర్భాగమైన దుందుభి నదికి జీవ కళ వచ్చింది. దుందుభి జలాలతో కొత్తూరు చెక్ డ్యాం, చెరువులకు కృష్ణమ్మ పరవళ్లు తీస్తున్నది. తద్వారా పిల్ల కాలువ మీదుగా కృష్ణయ్య పొలాన్ని కేసీఆర్ నీళ్లు ముద్దాడాయి. వరి సిరులు పండిస్తున్నారు. భూగర్భ జలాలకూ ఊపిరి రావడంతో ఒక ఎకరం కౌలుకు తీసుకొని, ఆ పొలంలోని బోరు నీటిని జోడించి మొత్తం మూడు ఎకరాలకు అనుసంధానం చేశారు. దీంతో నీటికి ఏ లోటూ రాకుండా చూసుకుంటున్నారు. ఏడాదికి రెండు పంటలు తీస్తున్నారు.సిటీలో తమ రెక్కల కష్టంతో పైసా పైసా కూడబెట్టుకొన్న శివకుమార్ ఓల్డ్ అల్వాల్ లో సొంతంగా శ్రీ గణేశ్ సెలూన్ పెట్టుకున్నాడు. మంగళవారాలు సహా ఏమాత్రం వీలు చిక్కినా తక్కిన రోజుల్లో శివకుమార్, గణేశ్ సోదరులు తమ ఊరికి వెళ్లి పొలం పనులు చేస్తుంటారు. అమ్మా నాన్నకు ఆసరా అవుతుంటారు. అయితే, ఇటీవల కాంగ్రెస్ సర్కారు తీరును చూసి శివ ఆందోళన వ్యక్తం చేస్తున్నాడు. అసెంబ్లీ సమావేశాలు చూస్తూ సీఎం, మంత్రులపై మండిపడ్డాడు.

సేద్యానికి చేరువైన చెక్ డ్యాం వద్ద ఆ మధ్య శివ తీసుకున్న సెల్ఫీ పిక్

బాగా ఓవర్ చేస్తున్నరు!

'కాంగ్రెసోళ్లు బాగా ఓవర్ చేస్తున్నరు. ఏదో అయిపోతున్నట్టు పబ్లిక్‌ను, ప్రజలను భయపెడుతున్నరు.' అంటూ అసెంబ్లీ సమావేశాలను సెల్‌ఫోన్‌లో చూస్తూ శివకుమార్ అప్రయత్నంగా రియాక్ట్ అయ్యాడు.

'కేసీఆర్ నీళ్లు ఇయ్యనిదే ఇంతగానం పాలాలు అయినయా? అంతంత వడ్లు పండినయా?

> కాంగ్రెస్ ఉన్నప్పుడు ఎట్లుండే? బోర్ల మీద దుమ్ము తప్ప ఏముండే? మనం ఇండ్లు కట్టుకుంటే పగుళ్లు రావా? కేసీఆర్ ఏమన్నా కాళేశ్వరం ప్రాజెక్టును కరాబ్ కట్టుమంటడా? ఇపుడు వీళ్లు ఏమైనా కడితే లోపాలు ఉండయా? పదేండ్లళ్ల కొన్ని మిస్టేక్స్ ఉంటయి. వీళ్లు ఒక్క మిస్టేక్ లేకుండనే పాలన చేస్తరనేతందుకు గ్యారెంటీ ఏంది?' అని ప్రశ్నించాడు. 'కేసీఆర్ అసెంబ్లీకి పోయేది ఉండే. అయినా రేపు నల్లగొండ మీటింగ్ గట్టిగనే అర్సుకుంటడు గని. కాంగ్రెసోళ్లను గెలిపించిన నెలకే మన జుట్టు సెంట్రల్ (కేఆర్ఎంబీ) చేతుల పెట్టిన్రు' అని వాపోయాడు. కేసీఆర్‌ను ఎట్ల దూరం చేసుకుంటిమి? అని అనిపిస్తున్నదని ఆవేదన చెందాడు. ఈ రెండు నెలల సంగతులన్నీ సభల తీస్తడు అంటూ శివ ప్రస్తుత ప్రభుత్వ వైఖరిపై ఇలా ప్రతిస్పందించాడు.

ఫంక్షనల్ ఫుడ్‌తో డయాబెటిక్‌కు కళ్లెం

- ఎన్ఐఎన్ అధ్యయనంలో వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): ఫంక్షనల్ ఆహారంతో డయాబెటిక్ వల్ల వచ్చే కంటి సమస్యలను నియంత్రించడానికి ఆస్కారం ఉన్నదని జాతీయ పోషకాహార సంస్థ అధ్యయనంలో తేలింది. ఫంక్షనల్ ఫుడ్ (ఆహార పదార్థాల మిశ్రమం)గా పిలిచే ఆహారంతో డయాబెటిస్ సోకిన ఎలుకల కంటి చూపు మెరుగుపడిందని పరిశోధనల్లో వెల్లడైంది. 'మిటిగేషన్ ఆఫ్ లెన్స్ ఓపాసిఫికేషన్ బై ఏ ఫంక్షనల్ ఫుడ్ ఇన్ ఏ డయాబెటిక్ రోడెంట్ మోడల్' పేరిట సైన్స్ డైరెక్ట్ జర్నల్‌లో పరిశోధన ఫలితాన్ని ప్రచురించారు. ఎన్ఐఎన్ పరిశోధకుల బృందం సీనియర్ సైంటిస్ట్ భానుప్రకాశ్‌రెడ్డి సారథ్యంలో జరిగిన అధ్యయనంలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఉసిరి, పసుపు, బ్లాక్ పెప్పర్, దాల్చిన, అల్లం, మెంతులతో చేసిన ఫంక్షనల్ ఫుడ్‌ను ఆహారంగా 20 వారాలపాటు ఎలుకలకు అందించగా, డయాబెటిస్ ప్రభావం తగ్గినట్టుగా పరిశోధకులు గుర్తించారు. ఫంక్షనల్ ఫుడ్ తీసుకున్న ఎలుకల్లో కంటి శుక్లాల సమస్య పెరగడం ఆగిపోయినట్టు గుర్తించారు. 2045 నాటికి మధుమేహుల సంఖ్య 783 మిలియన్లకు చేరుతుందని అంతర్జాతీయ డయాబెటిస్ ఫెడరేషన్ గణాంకాలు చెబుతుండగా, ఆహార నియమాలతోనే డయాబెటిస్‌కు కళ్లెం వేయొచ్చని ఈ పరిశోధనలో తేలింది.

చలో నల్లగొండ

మొదటిపేజీ తరువాయి...

కలిసి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, చంటి కాంత్రికిరణ్, పార్టీ నేతలు గ్యాదరి బాలమల్లు, కంచర్ల కృష్ణారెడ్డి, చాడ కిషన్‌రెడ్డి, గుత్తా అమిత్‌రెడ్డి, రవీందర్‌సింగ్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కేసీఆర్ సభపైనే అందరి దృష్టి : జగదీశ్‌రెడ్డి

ఇప్పటికే కృష్ణానది ప్రాజెక్టుల పట్ల కాంగ్రెస్ సర్కార్ తీరును ఎండగట్టడంలో బీఆర్ఎస్ సక్సెస్ అయ్యిందని, ఇదే అంశంపై నల్లగొండలో నిర్వహిస్తున్న కేసీఆర్ సభ మీద అందరి దృష్టి కేంద్రీకృతమైందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. సభకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తున్నదని తెలిపారు. సభకు తరలివచ్చే వారికి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపడుతున్నట్టు వివరించారు.

నల్లగొండ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

మరోసారి ఉద్యమబాట

కృష్ణానదీ జలాల్లో న్యాయమైన వాటా కోసం గొంతెత్తి నినదించిన ఏకైక తెలంగాణ నాయకుడు కేసీఆరే. తెలంగాణ ఉద్యమంలో భాగంగా మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలో జలసాధన యాత్రలు నిర్వహించి ప్రజలను జాగృతం చేసిన చరిత్ర మన కండ్లెదుటే ఉన్నది. నాటి ఉమ్మడి రాష్ట్ర పాలకులు కృష్ణా జలాల్లో తెలంగాణకు చేస్తున్న అన్యాయాన్ని తీవ్రంగా ఎండగట్టారు. తెలంగాణ యావత్ సమాజాన్ని చైతన్యపరచి ఆ దిశగా కదిలించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో అక్రమంగా, తెలంగాణకు తీవ్ర అన్యాయం చేసేలా పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటరీ విస్తరణకు పూనుకుంటే, ఆ నిర్ణయం తెలిసిన మరుక్షణమే పదవులను తృణప్రాయంగా వదిలిపెట్టి ఉద్యమబాట పట్టారు. ఇటు స్వరాష్ట్రంలోనూ తెలంగాణ జలహక్కుల సాధన కోసం పదేండ్లపాటు అవిశ్రాంత పోరాటం చేశారు. ఆపరేషన్ ప్రొటోకాల్, నీటి పంపకాలు పూర్తికాకుండా కేంద్రానికి ప్రాజెక్టులను అప్పగించడం వల్ల తెలంగాణకు తీరని అన్యాయం వాటిల్లుతుందని కేసీఆర్ ఆదినుంచీ బలమైన వాదనలు వినిపిస్తున్నారు. గత పదేండ్లుగా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించకుండా తెలంగాణ జలహక్కులను కాపాడుకుంటూ వచ్చారు. కేంద్రం మెడలు వంచి సెక్షన్ 3ను సాధించారు. తద్వారా తెలంగాణ రాష్ట్రం తనకు న్యాయంగా దక్కాల్సిన నీటివాటాను పొందేందుకు బాటలు వేశారు. స్వరాష్ట్రంలో సాధించిన జలహక్కులను ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు కాలరాసేందుకు పూనుకోవడంతో మళ్లీ పోరుకేక పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత వైఖరితో, కేఆర్ఎంబీకి రాష్ట్ర ప్రాజెక్టులను అప్పగించడం వల్ల కలిగే నష్టాన్ని తెలంగాణ సమాజానికి వివరించి చైతన్యపరిచేందుకు సంసిద్ధమయ్యారు. ఇప్పటికే కృష్ణా బేసిన్ పరిధిలోని ఉమ్మడి నల్లగొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, హైదరాబాద్ జిల్లాల పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా రైతులను, కార్యకర్తలను కదిలించారు.

మా పోరాటంతోనే కృష్ణాపై కాంగ్రెస్ తీర్మానం

- కాంగ్రెస్ పార్టీకి కేంద్రంతో లోపాయికారి ఒప్పందం
- వారి చేతగానితనం వల్లే కృష్ణాపై హక్కును కోల్పోయాం
- ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది
- నేడు నల్లగొండ సభకు భారీగా రానున్న జనం
- సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 12 : కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లే కృష్ణా నది ప్రాజెక్టుల హక్కులను కోల్పోయామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. కృష్ణా ప్రాజెక్టుల సాగునీటి హక్కులను కాపాడుకునేందుకు నల్లగొండలో మంగళవారం బీఆర్ఎస్ తలపెట్టిన చలో నల్లగొండ బహిరంగ సభా స్థలిని జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిశోర్‌కుమార్, జీవన్‌రెడ్డి, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, చంటి క్రాంతికిరణ్, రాష్ట్ర నాయకుడు గుత్తా అమిత్‌రెడ్డితో కలిసి సోమవారం పరిశీలించారు. అనంతరం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ నేటి సభకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి రైతులు, ప్రజలు భారీగా హాజరవుతారని తెలిపారు. కేసీఆర్ సభ కోసం కృష్ణా పరీవాహక ప్రాంత రైతులు, ప్రజలు ఆతృతగా ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. సభకు లక్షలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి కేంద్రంతో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే కృష్ణా జలాల హక్కులను కేఆర్ఎంబీకి అప్పగించినట్టు ఆరోపించారు. కేఆర్ఎంబీ ఆధీనంలోకి వెళ్లినా ముఖ్యమంత్రి, మంత్రులు సాగర్ ప్రాజెక్టు వద్దకు ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సాగర్ ప్రాజెక్టును ఆక్రమించడానికి ఏపీ వస్తే తరిమేసినట్టు తెలిపారు. కృష్ణా జలాల వివాదం తెలంగాణ ప్రజల జీవన్మరణ సమస్యగా అభివర్ణించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నన్నాళ్లు కృష్ణా ప్రాజెక్టులు తమ ఆధీనంలోనే ఉండేవని అన్నారు. కృష్ణా జలాల హక్కులను కేఆర్ఎంబీకి అప్పజెప్పడానికి ఏపీ ప్రభుత్వం ఒప్పుకొన్నా.. అప్పటి బీఆర్ఎస్ సర్కార్ ఒప్పుకోలేదని తెలిపారు. ఇక్కడి కాంగ్రెస్ నేతలు ఏపీ నేతలకు ఏజెంట్లుగా మారి, తెలంగాణ ద్రోహులుగా నిలిచారని మండిపడ్డారు. కృష్ణా జలాల హక్కు విషయంలో కేంద్రంపై పోరాడాల్సిన కాంగ్రెస్ నేతలు తమపై ఎదురు దాడికి దిగడం దురదృష్టకరమని అన్నారు. బీఆర్ఎస్ పోరాటంతోనే కృష్ణా జలాల హక్కులను కేఆర్ఎంబీకి అప్పగించలేదని, ఈ మేరకు అసెంబ్లీలో తీర్మానం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు తీరుపై ప్రజల్లో తిరుగుబాటు మొదలైందని అన్నారు. తెలంగాణ ప్రజలు మరోసారి నీటి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితి తలెత్తిన నేపథ్యంలో మంగళవారం నల్లగొండలో నిర్వహించే సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.

జనవరి నెల వేతనాల కోసం సీతాలక్ష్మికి టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ నేతల వినతి పత్రం

వేతనాలు చెల్లించండి

ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శికి టీఎస్‌డబ్ల్యూఆర్డీఈఏ వినతి

హైదరాబాద్, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ): జనవరి నెల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరుతూ తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి సీతాలక్ష్మికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగుల సంఘం (టీఎస్‌డబ్ల్యూఆర్టీఈఏ) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు, ప్రధాన కార్యదర్శి దయాకర్ సోమవారం సీతాలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సొసైటీ పరిధిలో దాదాపు 20వేల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉంటారని, 12వ తేదీ వచ్చినా ఇప్పటికీ జనవరి నెల వేతనాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకుల రిక్రూట్‌మెంట్ కంటే ముందే పదోన్నతులు, బదిలీలు పూర్తి చేయాలని సీతాలక్ష్మిని కోరారు. లేదంటే సీనియర్లకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు.

గురుకుల ఉపాధ్యాయుల ఆందోళనబాట

- ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలని జేఏసీ నాయకుల డిమాండ్
- నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన
- నేడు 'చలో ప్రజాభవన్'కు పిలుపు
- డిమాండ్లను పరిష్కరించాల్సిందే: స్టాఫ్ అసోసియేషన్ నేత ప్రభుదాస్

హైదరాబాద్, ఫిబ్రవరి12 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ గురుకులాల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆందోళనబాట పట్టారు. ప్రమోషన్లు, బదిలీలు చేపట్టిన తరువాతే గురుకుల పోస్టుల భర్తీ చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాల్లో నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై నిరసన తెలిపారు. ఇదే డిమాండ్‌తో మంగళవారం 'చలో ప్రజాభవన్'కు ప్రభుత్వ గురుకులాల ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీ పిలుపునిచ్చింది. జేఏసీ డిమాండ్లను పట్టించుకోకుండా ప్రభుత్వం ఆదరాబాదరాగా గురుకుల పోస్టుల భర్తీ చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ గురుకులాల ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు జేఏసీగా ఏర్పడి ఆందోళన బాటపట్టాయి. మంగళవారం ఉదయం 6 గంటలకు జ్యోతిబాపూలే ప్రజాభవన్ వద్దకు ఉపాధ్యాయులందరూ పెద్ద ఎత్తున తరలిరావాలని జేఏసీ పిలుపునిచ్చింది. ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇవ్వాలని, అప్పటికీ ప్రభుత్వం దిగిరాకపోతే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామని జేఏసీ ఈ సందర్భంగా హెచ్చరించింది.

సోమవారం ఆదిలాబాద్‌లోని బోథ్ గిరిజన డిగ్రీ కళాశాల ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న గురుకులాల జేఏసీ నాయకులు

ఇప్పటికే పనిచేస్తున్న వారు నష్టపోతారు

> గురుకుల పోస్టుల భర్తీని తప్పుబట్టడం మా ఉద్దేశం కాదు. ప్రమోషన్లు, బదిలీలు చేపట్టకుండాపోస్టులు భర్తీ చేస్తే సీనియర్లు, ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుంది. 317 జీవో సమస్యను కూడా ఇప్పటి వరకు పరిష్కరించలేదు.ప్రమోషన్లు, బదిలీలు చేపట్టాలి. లేదంటే భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం.
>
> - మామిడి నారాయణ, రాష్ట్ర అధ్యక్షుడు, టిగారియ సెంట్రల్ యూనియన్

సీనియారిటీ కోల్పోవాల్సి వస్తుంది

> ప్రమోషన్లు కల్పించకుండా రిక్రూట్‌మెంట్ చేపట్టడం వల్ల చాలా సర్వీస్ కలిగి ఉన్నప్పటికీ కొత్తగా నియమితులైన వారికంటే జూనియర్లుగా మారే ప్రమాదమున్నది. సుదీర్ఘ కాలంగా గురుకులాల్లో బదిలీలు చేపట్టకపోవడంతో మారుమూల ప్రాంతాల్లో అనేకమంది సీనియర్లు పనిచేయాల్సి వస్తున్నది. ప్రమోషన్లు, బదిలీల తర్వాతే నియామకాలు చేపట్టాలి.
>
> - ప్రభుదాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టాఫ్ అసోసియేషన్

హైబ్రీడ్‌లో సీయూఈటీ యూజీ ఎగ్జామ్

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ యూనివర్సిటీలు సహా ఇతర విద్యాసంస్థల్లోని అండర్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే సీయూఈటీ యూజీ ఎగ్జామ్‌ను హైబ్రీడ్ పద్ధతిలో నిర్వహించనున్నారు. దీనిపై ఇప్పటికే ఓ నిర్ణయం తీసుకోగా, ఈ ఏడాది నుంచే అమలుచేయనున్నారు. ఈ పరీక్షను రెండేండ్ల నుంచి ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు. ఈసారి ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోనూ నిర్వహించే అంశాన్ని ఎన్టీఏ పరిశీలిస్తున్నది.

'భూగర్భ శాఖ' పరీక్షల ఫైనల్ కీ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): తెలంగాణలోని భూగర్భ జల వనరులశాఖలో గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగాల భర్తీకి నిర్వహించిన పరీక్షల ఫైనల్ కీని టీఎస్‌పీఎస్సీ విడుదల చేసింది. 2023 జూలైలో ఈ పరీక్షలు నిర్వహించగా, తుది కీని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం విడుదల చేసింది.

- రైతుల రాస్తారోకో

నిర్మల్ జిల్లా తానూర్ మండలం హిప్నెల్లి గ్రామంలో సోమవారం రైతులు రాస్తారోకో చేశారు. ఆదివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వానతో మక్క, గోధుమ, శనగ, జొన్న పంటలు నేలమట్టం అయ్యాయని, తమను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ హిప్నెల్లి చౌరస్తాలో రెండు గంటలపాటు రాస్తారోకో నిర్వహించారు. - తానూర్

- దళితబంధు కోసం సీఎంకు ఉత్తరాలు

దళితబంధు లబ్ధిదారులు వినూత్న నిరసన చేపట్టారు. రెండో విడత నిధులు విడుదల చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన దళితబంధు సాధన సమితి ఆధ్వర్యంలో లబ్ధిదారుల నుంచి సేకరించిన లేఖలను సోమవారం జమ్మికుంట పోస్టాఫీసు నుంచి సీఎం కార్యాలయానికి పోస్టుచేశారు. - జమ్మికుంట

వైద్యం చేయాలా? ఎలుకలు పట్టాలా?

- పారిశుద్ధ్య నిర్వహణ ఏజెన్సీ బాధ్యత
- డ్యూటీలో లేని డాక్టర్‌ను ఎలా సస్పెండ్ చేస్తారు?
- కామారెడ్డి ఘటనలో ప్రభుత్వ తీరుపై భగ్గుమన్న డాక్టర్లు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసన
- ప్రభుత్వ తీరును ఖండించిన ఐఎంఏ

షేషెంట్‌ను ఎలుకలు కొరికిన ఘటనలో వైద్యులను బాధ్యులను చేయడాన్ని నిరసిస్తూ గోదావరిఖని ప్రభుత్వ దవాఖాన ఎదుట నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): 'ఐసీయూలో ఉన్న రోగులకు చికిత్స చేసి ప్రాణాలు కాపాడాలా? లేక ఎలుకలు పట్టుకుంటూ కూర్చోవాలా?' అంటూ ప్రభుత్వ దవాఖానల వైద్యులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కామారెడ్డి ప్రభుత్వ దవాఖాన ఐసీయూలో ఓ రోగిని ఎలుకలు కరిచిన ఘటనలో డాక్టర్లపై ప్రభుత్వం చర్యలు చేపట్టడంపై భగ్గుమన్నారు. టీటీజీడీఏ, ఇతర వైద్య సంఘాల పిలుపు మేరకు టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానలు, టీవీవీపీ పరిధిలోని వైద్యులు సోమవారం నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. ఆ ఘటన జరిగినప్పుడు దవాఖానలో లేని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సంపత్‌పై చర్యలు తీసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగిని ఎలుక కరిస్తే సంబంధిత శానిటేషన్ ఏజెన్సీ బాధ్యత వహించాల్సి ఉంటుందని, వైద్యులు ఎలా బాధ్యులవుతారని నిలదీశారు. డాక్టర్లపై వెంటనే సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'గాంధీ'లోనే వసంత్

ఈ ఘటనలో సస్పెన్షన్‌కు గురైన అసోసియేట్ ప్రొఫెసర్ వసంత్ కుమార్ ఈ నెల 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని గాంధీ మెడికల్ కాలేజీలో జరుగుతున్న 2019 ఎంబీబీఎస్ బ్యాచ్ పరీక్షలకు ఎగ్జామినర్‌గా హాజరైనట్టు గాంధీ మెడికల్ కాలేజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడిసిన్ ప్రకటించింది. దీంతో దవాఖానలోనే లేని వ్యక్తిని ఎలా సస్పెండ్ చేస్తారన్న ప్రశ్న మరింత బిగ్గరగా వినిపిస్తున్నది.

నిర్లక్ష్యానికి పరాకాష్ట

కామారెడ్డి ఘటనలో డాక్టర్లపై ప్రభుత్వం చర్యలు తీసుకోవడాన్ని అత్యంత నిర్లక్ష్యపూరిత చర్యగా ఐఎంఏ తెలంగాణ శాఖ అభివర్ణించింది. డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తివేయాలని లేదంటే ఉద్యమం చేస్తామని ఐఎంఏ అధ్యక్షుడు కాళీ ప్రసాద్‌రావు, కార్యదర్శి విజయ్ రావు హెచ్చరించారు. డాక్టర్లను సస్పెండ్ చేయడాన్ని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ కాంట్రాక్ట్ డాక్టర్స్ అసోసియేషన్ కూడా తీవ్రంగా ఖండించాయి.

నివేదిక అందాక చర్యలు: రాజనర్సింహ

కామారెడ్డి ఘటనపై విచారణకు ఆదేశించామని, నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో తనను కలిసిన తెలంగాణ ప్రభుత్వ డాక్టర్ల అసోసియేషన్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో ఆయన మాట్లాడుతూ.. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయి విచారణ నివేదిక తెప్పించుకుంటామని, దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం

యాదాద్రి భువనగిరి జిల్లాకు కేసీఆర్ సర్కార్ మంజూరు చేసిన మెడికల్ కాలేజీని సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్‌కు తరలించడాన్ని నిరసిస్తూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు భువనగిరిలో రాస్తారోకో. అనంతరం సీఎం దిష్టిబొమ్మ దహనం

- మామడలో ఆటో డ్రైవర్ల ధర్నా

ఉచిత ప్రయాణంతో గిరాకీ లేక రోడ్డునపడ్డ తమకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సోమవారం నిర్మల్ జిల్లా మామడ మండల కేంద్రంలోని నిర్మల్-మంచిర్యాల రహదారిపై ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లు ధర్నా